GHMC hmda Growing Global TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments

Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035

Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption

తెలంగాణ జిల్లాలు



మంగళవారం 13-10-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్




# పాలకీడు ప్రజావాణిలో అధికారుల కరువు




- ఉదయం 11:40 దాటినా కార్యాలయాల్లో కనిపించని పలువురు అధికారులు..
- సమయపాలనపై నోడల్ అధికారి పర్యవేక్షణ ఏదీ?
- ప్రజల ఫిర్యాదులకు స్పందించేదెవరు...?
- ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చిన వేదిక
- ఉన్నతాధికారుల ఆదేశాలు పేపర్ ప్రకటనలకే పరిమితమా..!
- డుమ్మా అధికారులపై చర్యలు ఉంటాయా
- మొక్కుబడిగా మండల స్థాయి ప్రజావాణి

**క్రైమ్ మిర్రర్, పాలకీడు :** మండల ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార మార్గం చూపాల్సిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులే ముఖం చాటేస్తే.. బాధితులు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలి...? పాలకీడు మండల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నోడల్ అధికారి, సంబంధిత అధికారుల హాజరు తీరు విమర్శలకు తావిస్తోంది. ఉదయం 11:40 గంటల సమయం దాటిన ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం కాలేదు.వివిధ శాఖలకు చెందిన సుమారు 20 నుంచి 23 మంది అధికారులు హాజరు కావాల్సి ఉండగా, కేవలం పది లోపు మాత్రమే హాజరైనట్లు తెలుస్తోంది. దీంతో ప్రజావాణి నిర్వహణ లక్ష్యం నీరుగారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

8లో

# తెలంగాణలో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమరభేరి

- అక్టోబర్ 13 నుంచి 33 జిల్లాల కలెక్టరేట్ల ఎదుట నిరవధిక సమ్మెకు పిలుపు
- 17 వేల మంది ఉద్యోగులు.. 78 విభాగాలు.. ఒక్కటే లక్ష్యం!
- ఉద్యోగాల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రధాన డిమాండ్
- ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమరానికి సిద్ధమయ్యారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రతతో పాటు ఇతర సేవా ప్రయోజనాలను కల్పించాలని కోరుతూ అక్టోబర్ 13, 2026 నుంచి రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టరేట్ల ఎదుట నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఉద్యోగులు, 78 విభాగాలకు చెందిన సిబ్బంది ఈ ఉద్యమంలో పాల్గొననున్నట్లు తెలిపింది.

**ఉద్యోగ భద్రత కోసం మరో పోరాటం!**

రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు కీలక సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలకు చేరవేయడంలో వైద్యులు, సహాయక నర్సులు, సిబ్బంది నర్సులు,

మిగతా 2లో

# ప్రజల కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకే ఉంది



- తెలంగాణ పోలీస్ అకాడమీలో 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్
- పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టం
- నాయకత్వం, నైతిక విలువలు, సాంకేతిక పరిజ్ఞానంపై డీజీపీ దిశానిర్దేశం
- నేరాల తీరు మారింది.. పోలీసింగ్ మారాలి
- ప్రజలకు నిజాయతీగా, రాగద్వేషాలకు అతీతంగా సేవలందించాలి
- పాసింగ్ అవుట్ పరేడ్‌లో చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి
- విధులు ఫిట్‌నెస్, స్మార్ట్‌నెస్ తప్పనిసరి: డీజీపీ సీవీ ఆనంద్

గండిపేట(క్రైమ్ మిర్రర్): పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టమని, ప్రజలకు సేవ చేయడంతోపాటు వారి ప్రాణాలను కాపాడే అరుదైన అవకాశం పోలీసు శాఖలో పనిచేసేవారికి లభిస్తుందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. తెలంగాణలో నాలుగు కోట్ల జనాభాలో సుమారు 90 వేల మందికే పోలీసు యూనిఫాం ధరించే అవకాశం ఉందని, ఇది మొత్తం జనాభాలో 0.3 శాతం మాత్రమేనని వివరించారు. ప్రతిరోజూ కనీసం 50 మంది కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకు ఉంటుందని పేర్కొన్నారు. నిజాయితీ, నైతిక విలువలను విస్మరించరాదని, కుల, మత, రాజకీయ రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.తెలంగాణ పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది

మిగతా 2లో



# విద్యుత్ చార్జీల పెంపును విరమించుకోవాలి!

**ట్రూ అప్ పేరుతో రూ.5,420 కోట్ల భారం ప్రజలపై వేయొద్దు**

**గుండాల సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం ధర్నా.. 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్**

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో :** విద్యుత్ చార్జీలు పెంచితే రాష్ట్రవ్యాప్తంగా మరో విద్యుత్ ఉద్యమం తప్పదు! ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెపురం రాజు డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించి, ప్రజలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. సోమవారం గుండాల సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) ట్రూ అప్ పేరుతో విద్యుత్ చార్జీలను పెంచే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ పేరుతో ప్రతిపాదించిన రూ.5,420.23 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని స్పష్టం చేశారు.

**"పెరిగిన ధరలతో ప్రజలపై మరింత భారం"!**

ఇప్పటికే నిత్యావసర వస్తువులు, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మద్దెపురం రాజు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులు వెంటాడుతున్న తరుణంలో విద్యుత్ చార్జీలు పెంచడం ప్రజలపై అదనపు భారం మోపడమేనని విమర్శించారు. ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన రూ.57,336 కోట్ల బకాయిలను వసూలు చేయకుండా సామాన్య ప్రజలపై భారాలు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

**"కరెంటు కోతలతో రైతుల విలవిల"!**

గుండాల మండలంలో విద్యుత్ కోతల కారణంగా పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, రైతులకు ఎనిమిది గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం



చేశారు. తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, తిరిగి రావడంతో స్టార్టర్లు, మోటార్లు కాలిపోతున్నాయని, దీంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.

**"అదనపు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలి"**

ప్రజల అవసరాలకు అనుగుణంగా అదనపు సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తగిన రక్షణ ఏర్పాట్లు చేసి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తుందని మద్దెపురం రాజు హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఈ అంబాల నర్సింహ, లైన్‌మెన్ కూరాకుల అంజయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు అనంతుల అంజయ్య, బత్తిని బిక్షం, ఎండీ ఖలీల్, కొలిచెలిమ అబ్బయ్య, సాలమ్మ పాల్గొన్నారు.

## తెలంగాణలో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమరభేరి

ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, ఔషధ పంపిణీదారులు, కార్యక్రమాల నిర్వహణ సిబ్బంది సహా వివిధ విభాగాల ఉద్యోగులు నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, ఏళ్ల తరబడి సేవలందిస్తున్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత, ఉద్యోగాల క్రమబద్ధీకరణ, న్యాయమైన వేతనాలు, ఇతర సేవా ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు ఐక్య కార్యాచరణ సమితి పేర్కొంది. ఈ సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు వెల్లడించింది. జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న అర్హులైన ఉద్యోగులను వర్తించే నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని ఉద్యోగ సంఘం డిమాండ్ చేస్తోంది. అన్ని విభాగాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వేతన సవరణ, న్యాయమైన వేతనాలు, పూర్తి స్థూల వేతనం వంటి అంశాలను పరిష్కరించాలని కోరుతోంది. అదేవిధంగా ఏటా ఐదు శాతం వేతన పెంపు, ఎనిమిది శాతం విధేయత ప్రోత్సాహకం, అర్హులైన మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు కల్పించాలని డిమాండ్ చేస్తోంది. ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా, ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించాలని, వివిధ విభాగాల మధ్య నెలకొన్న వేతనాలు, సేవా ప్రయోజనాల వ్యత్యాసాలను న్యాయబద్ధంగా సమీక్షించి పరిష్కరించాలని కోరుతోంది. అక్టోబర్ 13 నుంచి ప్రతి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ల ఎదుట చేపట్టనున్న నిరవధిక సమ్మెలో అన్ని విభాగాల ఉద్యోగులు ఐక్యంగా పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.




# ప్రజల కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకే ఉంది

డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2014 తర్వాత పూర్తిస్థాయిలో శిక్షణ ముగించుకుని బయటకు వస్తున్న తొలి డీఎస్పీ బ్యాచ్ కావడంతో దీనికి ప్రత్యేకత ఉందన్నారు. 44 వారాలపాటు చట్టాలు, దర్యాప్తు విధానాలు, ఔట్‌డోర్ శిక్షణ, క్రీడల్లో శిక్షణ పొందిన అధికారులను అభినందించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసిస్తూ, అకాడమీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని కారణాల వల్ల ముఖ్యమంత్రి పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారని పేర్కొన్నారు.

**30 ఏళ్ల వృత్తి జీవితానికి పునాది...**

పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా చేసే ప్రమాణం అధికారుల 30--35 ఏళ్ల వృత్తి జీవితానికి మార్గదర్శకంగా నిలవాలని డీజీపీ సూచించారు. రాజ్యాంగం పట్ల నిబద్ధతతో, ప్రజలకు నిజాయతీగా, రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహిస్తానని చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. అకాడమీలో శిక్షణ పూర్తయిన తర్వాత మరో 46 వారాలపాటు క్షేత్రస్థాయిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ దశలోనూ అదే శ్రద్ధ, క్రమశిక్షణ, నిజాయతీతో వ్యవహరించాలని సూచించారు. తన 35 ఏళ్ల పోలీసు అనుభవంలో నేర్చుకున్న అంశాలను గతంలో డీఎస్పీలతో నిర్వహించిన ముఖాముఖిలో వివరించానని, నాయకత్వ లక్షణాల ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేస్తున్నానని చెప్పారు.

**నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి: డీజీపీ**

ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. మీరు నాయకులుగా ఎంపికయ్యారు.. మీ నాయకత్వ లక్షణాలను విధుల్లో నిరూపించుకోవాలని అన్నారు. ధైర్యం, దార్శనికత, నైతిక విలువలు, నిష్పాక్షికత, బృంద స్ఫూర్తి, సంభాషణ నైపుణ్యాలు, కష్టపడే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆలోచనలు, వినయం.. ఈ పది లక్షణాలను ప్రతి అధికారి అలవర్చుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో నైతిక విలువలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించరాదన్నారు.

తాము యూనిఫాం ధరించిన రోజుల్లో నక్సలిజం ప్రధాన సవాలుగా ఉండేదని, ఆ సమస్యను పోలీసులు సమర్థంగా ఎదుర్కొన్నారని డీజీపీ గుర్తుచేశారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, రోడ్డు భద్రత, ఇతర కొత్త తరహా సవాళ్లు పోలీసుల ముందున్నాయని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీసు శాఖలో సంస్థాగత మార్పులు చేపట్టామని చెప్పారు. గ్రేహౌండ్స్ తదితర విభాగాల పునర్వ్యవస్థీకరణతోపాటు ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీజీ ఫాస్ట్, టీజీ స్పార్క్ వంటి విభాగాలను బలోపేతం చేసి కొత్త సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు కూడా ఈ మార్పులకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

**ఫిట్‌నెస్, స్మార్ట్‌నెస్ తప్పనిసరి...**

పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం, చురుకుదనం, వృత్తిపరమైన నైపుణ్యాలు అత్యంత ముఖ్యమని డీజీపీ అన్నారు. యూనిఫాం ధరించిన తొలిరోజు ఉన్న ఉత్సాహం, క్రమశిక్షణ, ఫిట్‌నెస్ 30 ఏళ్ల తర్వాత కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. పోలీసు పాసింగ్ అవుట్ పరేడ్‌లో బెల్టుపై ఉన్న హోల్ (రంధ్రం) 30 ఏళ్ల సర్వీసు పూర్తయ్యే వరకు, ఉద్యోగ విరమణ చేసేంతవరకు అలాగే ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, సమర్థవంతమైన నాయకులుగా ఎదగాలని డీఎస్పీలకు పిలుపునిచ్చారు.

**12 సంఖ్యకు ప్రత్యేక అనుబంధం- అకాడమీ డైరెక్టర్**

తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ.. 112 సంఖ్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ప్రజల అత్యవసర సేవల కోసం తెలంగాణ పోలీసు వ్యవస్థలో 112 సేవలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పుడు 112 మంది డీఎస్పీలు ప్రజా సేవలోకి అడుగుపెట్టడం విశేషమని పేర్కొన్నారు. వీరిలో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు ఉన్నారు. మల్టీజోన్-1 నుంచి 51 మంది, మల్టీజోన్-2 నుంచి 61 మంది ఎంపికయ్యారు. విద్యార్హతల పరంగా 79 మంది డిగ్రీ పట్టభద్రులు, 31 మంది పీజీ పూర్తి చేసినవారు ఉన్నారు. మరో ఇద్దరిలో ఒకరు ఎంబీబీఎస్, మరొకరు బీడీఎస్ పట్టా పొందారు. ఈ బ్యాచ్‌లో గతంలో రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసినవారు 45 మంది, కేంద్ర ప్రభుత్వంలో పనిచేసినవారు 12 మంది ఉండగా.. కొత్తగా ఉద్యోగ జీవితంలోకి అడుగుపెడుతున్నవారు 55 మంది ఉన్నారు. గతంలో పోలీసు శాఖలో ఎస్సైలుగా పనిచేసిన నలుగురు ప్రస్తుతం డీఎస్పీలుగా ఎంపికయ్యారు. శిక్షణ పొందుతూనే 2026లో యూపీఎస్సీ పరీక్షల్లో జి.సృజన 55వ ర్యాంకు, డి.ప్రవీణ్‌కుమార్ 795వ ర్యాంకు సాధించడం విశేషం.



## చికిత్స పొందుతున్న భారతమ్మకు రూ.10 వేల ఆర్థిక సాయం

**ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోగయ్య**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ):** వెల్దండ మండల కేంద్రానికి చెందిన నాగిళ్ల భారతమ్మ గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోగయ్య సోమవారం ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. భారతమ్మ ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆమె అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం భారతమ్మ కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయంగా కానుగుల జోగయ్య రూ.5,000, వార్డు సభ్యుడు శేఖర్ రూ.5,000 అందజేశారు. మొత్తం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని భారతమ్మ కుటుంబ సభ్యులకు అందించి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, నాయకులు కట్ట అనిల్ కుమార్, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోండి

**నవంబర్ 6లోగా ఫారం--18 ద్వారా నమోదు చేసుకోవాలి**

**అర్హులైన పట్టభద్రులకు యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ పిలుపు**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్)‌:** రంగారెడ్డి--హైదరాబాద్--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కల్వకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ పిలుపునిచ్చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 నవంబర్ 1వ తేదీ నాటికి లేదా అంతకుముందు డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి 2026 నవంబర్ 6 చివరి తేదీ కావడంతో చివరి రోజు వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, యువత, ఉద్యోగులు, ఇతర పట్టభద్రులు ఈ విషయంపై అవగాహన కలిగి ఉండాలని షాబుద్దీన్ పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, వార్డు సభ్యుడు భానుకిరణ్, మండల సోషల్ మీడియా కన్వీనర్ రమేష్, ప్రవీణ్ గౌడ్, గంజి చంద్రశేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# వైరా రైతుల పంటల రక్షణకు అత్యవసర కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలి!.

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే నీటి కొరత ముప్పును దృష్టిలో ఉంచుకుని, వైరా నియోజకవర్గంలోని రైతుల పంటలను, గ్రామీణ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు అత్యవసర కార్యాచరణ రూపొందించాలని మాజీ ఎమ్మెల్యే డా. బి. చంద్రావతి కోరారు. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లకు లిఖితపూర్వక వినతిపత్రాన్ని ఈ-మెయిల్ ద్వారా పంపినట్లు తెలిపారు. వైరా, కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు, కారేపల్లి మండలాల్లో పంటల పరిస్థితి, సాగునీటి అవసరాలు, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భజలాల లభ్యత, తాగునీటి వనరులపై గ్రామస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని కోరారు. ముఖ్యంగా సీతారామ ప్రాజెక్టు, వైరా ప్రాజెక్టుల ద్వారా అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించి, చివరి ఆయకట్టు రైతుల వరకు సాగునీరు చేరేలా స్పష్టమైన నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణ, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా, గ్రామాలు, తండాల్లో తాగునీటి సమస్యల నివారణతో పాటు పశుగ్రాసం, పశువులకు తాగునీటి లభ్యతపై ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. "రైతుల పంటలు ఎండిపోయిన తర్వాత నష్టాన్ని లెక్కించడం కాదు... పంటలను కాపాడేందుకు ముందుగానే చర్యలు చేపట్టాలి. రైతు కష్టాన్ని గుర్తించి, సమస్య తీవ్రతరమయ్యేలోపే పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యత" అని డా. బి. చంద్రావతి స్పష్టం చేశారు. పత్రికా కథనాల ప్రకారం, అక్టోబర్ 12న జరగాల్సిన కరువు--ఎల్‌నినో మంత్రుల సమీక్ష వాయిదా పడినట్లు తెలిసిందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు, తదుపరి సమావేశ తేదీని అధికారికంగా వెంటనే ప్రకటించాలని కోరారు.



అప్పటివరకు రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి నష్టపోకుండా-నీటి లభ్యత, విద్యుత్ సరఫరా, సాగుకు అనుకూలమైన పంటలు, ప్రత్యామ్నాయ పంటలపై జిల్లాలు, మండలాలు, గ్రామాలవారీగా లిఖితపూర్వక మధ్యంతర యాసంగి మార్గదర్శకాలను తక్షణమే జారీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ, నీటిపారుదల, విద్యుత్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖలు సమన్వయంతో పనిచేసి, స్థానిక సమస్యలను గుర్తించాలని సూచించారు. వాటి పరిష్కారానికి బాధ్యతగల అధికారులను నిర్ణయించి, నిర్దిష్ట కాలపరిమితిలో చర్యలు చేపట్టాలని కోరారు. "సమీక్ష వాయిదా పడవచ్చు---రైతుల సమస్యలు, ప్రభుత్వ బాధ్యత వాయిదా పడకూడదు. ప్రతి గ్రామానికి కార్యాచరణ ఉండాలి... ప్రతి శాఖకు బాధ్యత ఉండాలి... ప్రతి రైతుకు భరోసా కలగాలి. సాగునీరు చివరి ఆయకట్టు రైతుకు చేరినప్పుడే ప్రభుత్వ సమీక్షలకు నిజమైన సార్థకత ఉంటుంది" అని డా. బి. చంద్రావతి పేర్కొన్నారు. వినతిపత్రంపై రెండు జిల్లాల యంత్రాంగం తక్షణమే స్పందించి, చేపట్టబోయే చర్యలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.

# గుప్త నిధుల కోసం తవ్వకాలు.. ఎనిమిది మంది అరెస్ట్

- **కాళేశ్వరంలో అర్ధరాత్రి పోలీసుల దాడి**
- **మెటల్ డిటెక్టర్, ఏడు సెల్‌ఫోన్లు, పార స్వాధీనం**
- **బెలెనో కారు సీజ్.. కేసు నమోదు**

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం గ్రామంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారనే ఆరోపణలపై ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి గుప్త నిధుల అన్వేషణకు ఉపయోగించే మెటల్ డిటెక్టర్‌తో పాటు ఏడు సెల్‌ఫోన్లు, ఒక పార, బెలెనో కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**అర్ధరాత్రి పోలీసుల దాడి..**

కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2026 అక్టోబర్ 11వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో కాళేశ్వరం గ్రామంలోని మసీదు వాడలో మహమ్మద్ వాజిద్ ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు.

**వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు..**

పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో హైదరాబాద్‌కు చెందిన దొడ్డ వేణుగోపాల్, కరీంనగర్‌కు చెందిన మూల మోహన్, మంచిర్యాలకు చెందిన ముడిమడుగుల శంకర్ ఉన్నారు. అలాగే కాళేశ్వరం గ్రామానికి చెందిన మహమ్మద్ వాజిద్, సయ్యద్ సలీం, సయ్యద్ సత్తార్, షేక్ తాజుద్దీన్ అలియాస్ బాబా, సిరోంచ పరిధిలోని అసరెల్లికి చెందిన ఇలియాజ్ ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

**పరికరాలు, వాహనం స్వాధీనం..**

నిందితుల వద్ద నుంచి ఒక మెటల్ డిటెక్టర్, ఏడు సెల్‌ఫోన్లు, ఒక పార, ఒక బెలెనో కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు కాళేశ్వరం ఎస్ఐ వెల్లడించారు.

**గుప్త నిధుల అన్వేషణపై చర్చ..**

గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు ఆరోపణలు రావడం, ఈ వ్యవహారంలో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు పోలీసులు గుర్తించడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. అయితే, తవ్వకాల వెనుక ఉన్న పూర్తి వివరాలు, గుప్త నిధుల అన్వేషణకు సంబంధించిన ఇతర అంశాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.



# అంబట్‌పల్లి పీహెచ్‌సీలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!





**వైద్య ఆరోగ్య సిబ్బంది ఐక్యతకు ప్రతీకగా పూల పండుగ**

**హోదాలు పక్కనపెట్టి ఒక్కటైన వైద్యులు, సిబ్బంది**

**తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ఘనంగా పట్టం**

**క్రైమ్ మిర్రర్,పలిమెల ప్రతినిధి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఘనంగా జరిగాయి. ఉమ్మడి మహాదేవపూర్, పలిమెల మండలాల పరిధిలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు డాక్టర్ తేజావత్ కళ్యాణి ఆధ్వర్యంలో, డాక్టర్ జగదీశ్ ఖన్నా అధ్యక్షతన బతుకమ్మ సాంస్కృతిక సంబరాలను నిర్వహించారు.

**హోదాలు వేరైనా.. అందరి లక్ష్యం ఒక్కటే!**

ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ సేవలందించే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వైద్యులు మొదలుకొని కంటింజెంట్ వర్కర్లు, అధికారులు, అటెండర్ల వరకు ప్రతి ఒక్కరూ హోదాలు, స్థాయిలనే తేడాలు పక్కనపెట్టి ఐకమత్యంతో బతుకమ్మ సంబరాల్లో మమేకమయ్యారు.

**ప్రకృతి పూలతో బతుకమ్మ.. సంప్రదాయ పాటలతో సందడి!**

ప్రకృతి ప్రసాదించిన వివిధ రకాల రంగురంగుల పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చారు. అనంతరం తెలంగాణ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, అడుగులు కలుపుతూ, చప్పట్లతో సందడి చేస్తూ ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. పూల పండుగ ప్రాంగణమంతా పల్లెపాటలతో, సాంస్కృతిక ఉత్సాహంతో కళకళలాడింది.

**సిబ్బంది ఐక్యతకు నిదర్శనంగా వేడుకలు**

నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇలా ఒకచోట చేరి సంప్రదాయ పండుగను జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంతో పాటు సిబ్బందిలో పరస్పర స్నేహభావం, ఐక్యతను మరింత బలోపేతం చేసేలా ఈ వేడుకలు సాగాయి ఈ బతుకమ్మ సాంస్కృతిక సంబరాల్లో మహాదేవపూర్, పలిమెల మండలాలకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా వీధుల్లోకి రావాలి






**జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగిస్తాం**

**టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 12:** దేశ ప్రజల ఓటు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా ప్రతి ఒక్కరూ వీధుల్లోకి రావాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ పోరాటానికి సంఘీభావంగా సోమవారం సంగారెడ్డి పట్టణంలో ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి ఓల్డ్ బస్టాండ్‌లోని అంబేద్కర్ చౌక్ వరకు సాగిన ఈ ర్యాలీలో నిర్మలా జగ్గారెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ర్యాలీ సందర్భంగా కార్యకర్తలు "జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి", "మోదీ డౌన్ డౌన్", "రాహుల్ గాంధీ జిందాబాద్" అంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ చౌక్‌కు చేరుకున్న జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి లు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందని, బీజేపీ ప్రజల ఓటు హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ ఢిల్లీ వీధుల్లోకి వచ్చి పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. మన అధినేత రాహుల్ గాంధీ రోడ్లపై పోరాడుతుంటే, కాంగ్రెస్ కార్యకర్తలు ఇళ్లలో ఉండటం సరైనది కాదన్నారు. ఆయనకు మద్దతుగా కాంగ్రెస్ శ్రేణులతో పాటు దేశ ప్రజలందరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. తాను ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, రాహుల్ గాంధీ పోరాటానికి సంగారెడ్డి నుంచే సంఘీభావం ప్రకటించాలనే ఉద్దేశంతో స్థానికంగా భారీ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఓట్ల చోరీ అంశాన్ని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కనీసం మరో పది మందికి వివరించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆపబోమని రాహుల్ గాంధీ ప్రకటించారని జగ్గారెడ్డి తెలిపారు. ఆ డిమాండ్ నెరవేరే వరకు సంగారెడ్డిలోనూ తన నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.





# కాషాయ జెండాల కోసం రూ.25,016 విరాళం

**హిందూ ఐక్యవేదిక సభ్యులకు అందజేసిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు బావండ్ల మంజుల మధు**

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి పట్టణాన్ని కాషాయ జెండాలతో అలంకరించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు, 14వ వార్డు కౌన్సిలర్ బావండ్ల మంజుల మధు రూ.25,016 విరాళాన్ని అందజేశారు. సోమవారం హిందూ ఐక్యవేదిక సభ్యులకు ఈ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంప్రదాయంలో కాషాయ రంగుకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, ఆధ్యాత్మికత, ధర్మానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా విజయదశమి పర్వదినం సందర్భంగా భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు పట్టణమంతా కాషాయ జెండాలతో అలంకరించాలనే సంకల్పంతో ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. కాషాయ జెండాల కోసం రూ.25,016 విరాళం అందించిన బావండ్ల మంజుల మధుకు హిందూ ఐక్యవేదిక సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక సభ్యులు మురళీధర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, వీరెడ్డి మధు, మహేష్ రెడ్డి, రాఘవేందర్, శ్రీను, దామర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జే. సురేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు..

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే జే. సురేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు మాదాపూర్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, సన్నిహితులు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేసి, శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తన జన్మదిన వేడుకలకు విచ్చేసి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ సురేష్ ముదిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలలో అనిల్ యాదవ్,నేహా యాదవ్, శ్రీకాంత్ యాదవ్, విశాల్ యాదవ్, తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు





# గుమ్మడిదల లో నీరు లేక నెర్రబారుతున్న పంట భూములు

**కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ కరెంట్ కష్టాలు మొదలు**

**అనంతారంలో ఎండిపోతున్న పంటలను పరిశీలించిన సిజిఆర్**

**సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్**

**క్షేత్రస్థాయిలో పర్యటించిన చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 12 :** విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండల పరిధిలోని అనంతారం గ్రామంలో సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి, నీరందక ఎండిపోతున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిజిఆర్ మాట్లాడుతూ.. సాగు భూములు నెర్రలుబారుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి అత్యంత కీలకమైన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలకు సకాలంలో నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో మళ్లీ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము శ్రీను, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు జింక గోపాల్, మహేష్ యాదవ్, తలారి మహేష్, శ్రీశైలం, కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** మీర్పేట్ పోలీస్ స్టేషన్లో నమోదైన అయిన పోక్సో కేసులో అన్నోజి వినోద్ కుమార్ అలియాస్ వినోద్, అలియాస్ చిన్ని, వయసు 28, రంగారెడ్డి జిల్లా, బాలాపూర్ మండలం హుడా కాలనీ లెనిన్ నగర్ చెందిన నిందితుడికి జీవిత ఖైదు విధించిన ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి ఫర్ ఎక్స్‌పెడిషియస్ ట్రయల్ అండ్ డిస్పోజల్ ఆఫ్ రేప్ అండ్ పోక్సో యాక్ట్ కేసులు, రంగా రెడ్డి జిల్లా, ఎల్.బి.నగర్ వారు జీవిత ఖైదు విధించి, పదివేల జరిమానా విధించి, బాధితురాలికి లక్ష రూపాయల పరిహారం మంజూరు చేశారు.



# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళిక







**నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం**

**అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశం**

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 12:** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. యాసంగి 2026--27 సీజన్‌లో నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరాను పరిగణనలోకి తీసుకొని రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి రైతు వేదిక నుంచి కలెక్టర్ ప్రతీక్ జైన్, సంబంధిత శాఖల అధికారులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం, యాసంగి పంటల ప్రణాళిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి వినియోగం, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం, తాగునీటి సంరక్షణ తదితర అంశాలపై చర్చించారు. హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని పలు సూచనలు చేశారు. యాసంగిలో నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని, వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పెసలు, మినుములు, శనగ, కుసుమ వంటి పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. బిందు సేద్యం ద్వారా ఆయిల్‌పామ్, కూరగాయలు తదితర పంటలను సాగు చేస్తూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరుబావుల రీఛార్జ్ పనులను చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టాలని సూచించారు. తద్వారా భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించవచ్చని తెలిపారు. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసే అంశంపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, భూగర్భ జలాల పరిస్థితిపై అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్, నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వర్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి, జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# చండూరు మర్కండేశ్వర ఆలయంలో ఘనంగా కొనసాగుతున్న శరన్నవరాత్రులు

**ఇక్కత్ పట్టు వస్త్రాన్ని సమరించిన మాస్టర్ వీవర్ జూలూరు శ్రీనివాసులు-సునీత దంపతులు**

**చండూరు, క్రైమ్ మిర్రర్:** చండూరు మర్కండేశ్వర ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరి మాత శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం అమ్మవారు శ్రీ గాయత్రి దేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పూజా కర్తలు కోడి శివశంకర్-ప్రశాంతి దంపతులు. అమ్మవారికి ఇక్కత్ పట్టు చీరెను మాస్టర్ వీవర్ జూలూరు శ్రీనివాసులు-సునీత దంపతులు. అన్న ప్రసాద వితరణ దాత చెరిపల్లి భిక్షమయ్య-శోభ దంపతులు, వారి కుమార్తె డా. హరిణి. నవరాత్రిలలో కంకణదధారులకు అన్నప్రసాద దాత కర్నాటి విద్యాసాగర్-కరుణశ్రీ, నిత్య పులిహోర సమర్పణ జులూరు కృష్ణయ్య-పద్మ, ఇక్కత్ చీరల దాతలు గంజి యాదగిరి-యశోద,జూలూరు ఆంజనేయులు-పద్మ, జూలూరు శ్రీనివాసులు-సునీత, చిలుకూరి శ్రీనివాసులు-రాధిక, పగిడిమర్రి శ్రీనివాసులు-జయలక్ష్మి, చిలుకూరి నర్సింహ్మా-లక్ష్మమ్మ, చెరపల్లి అంజయ్య-యాదమ్మ, కలిమికొండ మహేష్-గిరిజ, పద్మావతి హాండ్లూమ్స్(యేశాల హరీష్.నవరాత్రిలలోదనిత్యపూల దండల దాతలు గుర్రం భిక్షమయ్య, కోమటి వీరేశం, అర్చక దాత పాల్వాయి స్రవంతిరెడ్డి,హోమ సామగ్రి దాత కోడి వెంకటేశం-కళమ్మ, పూజా సామాగ్రి దాత జూలూరు శేఖర్-వరలక్ష్మి, అమ్మవారికి నిత్య లడ్డూల దాతలు ఏలె శ్రీనివాసులు, కోడి శివశంకర్ వస్తురూపేణ దాతలు కటకం రమేష్, ఏలె శ్రీనివాసులు, జూలూరు వెంకటే0శం, పూజా కార్యక్రమంలో పాల్గొను భక్తులు ఉత్సవ కమిటీ వద్ద పేరు నమోదు చేసుకోవాలని ఆలయ ఛైర్మన్ రావిరాల నగేష్ తెలిపారు. అలాగే అమ్మవారి చీరల వేలం పాటలో ఆసక్తి గల భక్తులు తమ పేరును ఫోన్ నెం. 9985041123, 8885440002, 9885751117, 8142246328లకు సంప్రదించాలని తెలిపారు.



## మాల వేసుకున్న విద్యార్థులపై వివక్ష చూపడం దుర్మార్గం

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** హైదరాబాద్ లో ని సంతోష్ నగర్ సైనిక్ స్కూల్‌లో దుర్గామాత మాల ధరించిన విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించకపోవడం మరియు వారిని అవమానించడంపై రాష్ట్రీయ హిందూ ధర్మ రక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆంజనేయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యానికి ఆయన గట్టి హెచ్చరిక జారీ చేశారు. హిందూ సాంప్రదాయాలను, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించడం క్షమించరాని నేరమని, విద్యార్థుల మత విశ్వాసాలను గౌరవించాల్సింది పోయి మాల వేసుకున్న విద్యార్థులపై వివక్ష చూపడం అత్యంత దుర్మార్గం. తక్షణమే ఈ ఘటనకు బాధ్యులైన ఉపాధ్యాయురాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రీయ హిందూ ధర్మ రక్షణ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసన కార్యక్రమాలు చేపడతామని, పాఠశాల యాజమాన్యం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు.

## వలిగొండ రోడ్డు జంక్షన్ మళ్లీ మూసివేత... ప్రజలకు తప్పని తిప్పలు!



**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో వలిగొండ రోడ్డు జంక్షన్‌ను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే మళ్లీ మూసివేయడంపై చెరుకు శివకుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్థానికుల పోరాటంతో స్పందించిన అధికారులు రహదారిని పునరుద్ధరించగా, ఇప్పుడు మళ్లీ మూసివేయడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు దాటేందుకు సురక్షితమైన మార్గం కల్పించాలని, వలిగొండ రోడ్డు జంక్షన్‌ను పునరుద్ధరించాలని చెరుకు శివకుమార్ గౌడ్ డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదు! జంక్షన్ పునరుద్ధరించాలి... ప్రజలకు న్యాయం చేయాలి! లేదంటే జాతీయ రహదారి రాస్తారోకో చేస్తాం అని హెచ్చరించారు

## ఎన్ఎస్ హోమ్ అప్లయెన్సెస్ షాప్ ని ప్రారంభించిన ఎడ్ల రమేష్



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 12:** నియోజకవర్గంలోని బీరంగూడ డివిజన్ పరిధిలో గల జయలక్ష్మి నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఎస్ హోమ్ అప్లయెన్సెస్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యి ఆయన చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి షాప్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా షోరూమ్‌ను ప్రారంభించిన యజమానులు సాయిరాం, అస్లాంలకు ఎడ్ల రమేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని, మరింత అభివృద్ధి సాధించాలని ఎడ్ల రమేష్ ఆకాంక్షించారు.

## జై భవాని గ్రూప్ ఆధ్వర్యంలో వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

### విగ్రహ దాత పాటిబండ్ల సుధాకర్ సుధా దంపతులు



**కోదాడ అక్టోబర్ 12 ( క్రైమ్ మిర్రర్ ):** కోదాడ సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని ఎన్ఆర్ఎస్ కాలేజీ వెనుక ఉన్న శ్రీమన్నారాయణ కాలనీలో జై భవాని గ్రూప్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా, ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారిని వివిధ అలంకరణలతో కొలుస్తూ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తున్నారు.ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి సన్నిధిని పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకునేందుకు కాలనీవాసులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థిస్తున్నారు.జై భవాని గ్రూప్ ఆధ్వర్యంలో భక్తులకు ఆధ్యాత్మిక భక్తిభావాన్ని పెంపొందించేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దేవి నవరాత్రి ఉత్సవాలతో శ్రీమన్నారాయణ కాలనీలో పండుగ శోభ నెలకొంది. భక్తులు ఎంతో నియమనిష్ఠలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొంటూ అమ్మవారి కృపాకటాక్షాల కోసం ప్రార్థిస్తున్నారు.దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు, కాలనీవాసుల మధ్య ఐక్యతను, భక్తిభావాన్ని చాటిచెబుతున్నాయి. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని జై భవాని గ్రూప్ సభ్యులు, భక్తులు ఆకాంక్షిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న ఈ ఉత్సవాలు కాలనీవాసుల్లో విశేష ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీ భవాని గ్రూపు సభ్యులు వెంకటరమణ (టీచర్), శాంత, రేణుక, సావిత్రి, స్వప్న, ఐశ్వర్య, నాగమణి, మాధవి, రాజేశ్వరి, ధనలక్ష్మి, త్రివేణి, ఒక్కవంతుల మట్టపల్లి రావు, కనకాచారి, సతీష్, బండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కంది వద్ద రూ.71.40 లక్షల గంజాయి పట్టివేత

### 142.8 కిలోల ఎండు గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

### రెండు కార్లు సీజ్.. వివరాలు వెల్లడించిన ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 12:** సంగారెడ్డి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కంది ఎక్స్ రోడ్ వద్ద సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.71.40 లక్షల విలువైన 142.8 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేసి, గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు కార్లను సీజ్ చేశారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ వెల్లడించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సంగారెడ్డి ఎస్-న్యాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు, సంగారెడ్డి రూరల్ సీఐ నయీముద్దీన్, ఎస్సైలు మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్, వెంకటేశం తమ సిబ్బందితో కలిసి కంది ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వస్తున్న హ్యుందాయ్ ఎక్సెంట్, మారుతి సుజుకి ఫ్రాంక్స్ కార్లను తనిఖీ చేశారు. హ్యుందాయ్ ఎక్సెంట్ కారులో 35 ప్యాకెట్లలో తరలిస్తున్న 142.8 కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.71,40,000 ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. అనంతరం ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని, రెండు కార్లను సీజ్ చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన రోషన్ కర్జీ (26), బిబుధ రాజ్తా (22)గా గుర్తించారు. వీరిపై సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 588/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ సాగు, రవాణా, సరఫరా, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం తెలిసినవారు ఎస్-న్యాబ్ నంబర్ 8712656777కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్-న్యాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు, సంగారెడ్డి రూరల్ సీఐ నయీముద్దీన్, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

## అంగరంగ వైభవంగా కొనసాగుతోన్న దేవి నవరాత్రి ఉత్సవాలు

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వాసవి మాత అర్ధనారీశ్వరి రూపంలో భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి తిలకధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ జూలూరు రమేష్ బాబు మాట్లాడుతూ.. గత 37 సంవత్సరాలుగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, ఉత్సవాల్లో భాగంగా అన్నప్రసాద వితరణ చేపడుతున్నామని పేర్కొన్నారు. సోమవారం సుమారు 2,500 మందికి అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కల్మిచర్ల గోపాల్, కార్యదర్శులు నారాయణరాజు, పానుగంటి నవీన్, కోశాధికారులు గుబ్బ కిషన్, వాసా మనీష్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాసా శేఖర్, ఆవోప అధ్యక్షుడు కల్మిచర్ల రాఘవేందర్‌తో పాటు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.





# పట్టు సాగుతో తక్కువ పెట్టుబడి.. అధిక లాభాలు

**కోరింతకుంటలో పట్టు పురుగుల పెంపకంపై రైతులకు అవగాహన**

**మల్బరీ సాగుతో ఏడాదికి పది పంటలు పండించే అవకాశం**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** పట్టు పురుగుల పెంపకంతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని రంగారెడ్డి జిల్లా పట్టు సంఘం అధ్యక్షులు, ఎస్ఆర్సీ హెడ్ శక్రు చౌహాన్ రైతులకు వివరించారు. జాయింట్ డైరెక్టర్ లత సూచనల మేరకు సోమవారం నారాయణపేట, వికారాబాద్ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 50 మంది రైతులు కోరింతకుంట గ్రామంలోని సెరికల్చర్ రిసోర్స్ సెంటర్ (ఎస్ఆర్సీ), పట్టు పురుగుల పెంపక షెడ్లు, మల్బరీ తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా శక్రు చౌహాన్ రైతులను గ్రామంలోని పలు పట్టు పురుగుల పెంపక షెడ్ల వద్దకు తీసుకెళ్లి, పట్టు పురుగుల పెంపక విధానం, పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెట్టుబడి, ఆదాయం, లాభాల గురించి క్షేత్రస్థాయిలో వివరించారు. పట్టు పురుగుల పెంపకంలో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులను ప్రత్యక్షంగా చూపిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. మల్బరీ పట్టు సాగుకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉండే అవకాశముందని, కేవలం రెండు ఎకరాల భూమిలోనే ఏడాదికి సుమారు పది పంటలు పండించే అవకాశం ఉంటుందని వివరించారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, ఎల్‌నినో వంటి ప్రభావాలు ఎదురైనప్పటికీ, తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ పట్టు సాగు ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సంవత్సరం పొడవునా పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టే వీలుండటంతో యువ రైతులు సైతం ఈ సాగుపై ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. అనంతరం కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా నుంచి వచ్చిన సుమారు ఎనిమిది మంది రైతులు సైతం కోరింతకుంటలోని ఎస్ఆర్సీ కేంద్రాన్ని, పట్టు పురుగుల పెంపక షెడ్లను సందర్శించి సాగు విధానాలను తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పట్టు సాగు విధానాన్ని పరిశీలించిన రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ మహిపాల్, గ్రామ సర్పంచ్ సరోజ రవీందర్, వార్డు సభ్యుడు వినోద్ కుమార్, మల్లేష్, భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




# బస్వాపురం ప్రాజెక్టు భూనిర్వాసితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి

**ం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ డిమాండ్**

**ం ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే**

**ం న్యాయం జరగకపోతే ప్రాజెక్టు పనులను అడ్డుకుంటాం: సీపీఎం హెచ్చరిక**



**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:** భువనగిరి బస్వాపురం ప్రాజెక్టు (నృసింహసాగర్ రిజర్వాయర్) నిర్మాణంలో భూములు కోల్పోయిన పేద రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అధికారి (ఇ=ూ) ని కలిసి నిర్వాసిత రైతులతో పాటు సీపీఎం బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ భువనగిరి మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో నిర్మిస్తున్న రిజర్వాయర్ కోసం సర్వే నెంబర్ 229 లో గల 110 ఎకరాల 24 గుంటల ప్రభుత్వ భూమిని సేకరించారని తెలిపారు. తరతరాలుగా ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న 97 మంది పేద రైతులు ప్రాజెక్టు కారణంగా ప్రస్తుతం ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అప్పటి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, సదరు భూమిని సాగు చేసుకుంటున్న 97 మంది రైతులకు నష్టపరిహారానికి పూర్తి అర్హత ఉన్నట్లు గుర్తించారని ఆయన గుర్తు చేశారు. అధికారులు నివేదికలు తయారు చేసి ఏళ్లు గడుస్తున్నా, జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ఇంతవరకు రైతులకు పైసా నష్టపరిహారం అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయగిరి రెవెన్యూ పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సర్వే నెం. 259 లోని ప్రభుత్వ భూమి నుండి ప్రాజెక్టు కాలువ తీసినప్పుడు, అక్కడ సాగు చేసుకుంటున్న వారికి ప్రభుత్వం ఏ విధంగానైతే నష్టపరిహారం చెల్లించిందో, అదే జీవో ప్రకారం బస్వాపురం బాధితులకు కూడా వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత రైతుల పట్ల జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహశీల్దార్లు దాటవేత ధోరణి వీడాలని, బాధితులకు ఎందుకు స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అధికారులు కేవలం దరఖాస్తులు తీసుకోవడమే తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. రైతుల సమస్య పరిష్కారానికి ఇంకెంత కాలం పడుతుందని జిల్లా యంత్రాంగాన్ని నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి నష్టపరిహారం విడుదల చేయాలని, లేనిపక్షంలో బాధితులతో కలిసి బస్వాపురం ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని, ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కమిటీ సభ్యులు మద్యపురం బాల్ నర్సింహ, సీపీఎం నాయకులు దయ్యాల మల్లేష్‌తో పాటు భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులు ఉడత విష్ణు, మచ్చ వెంకట్ నర్సయ్య, ఏనబోయిన విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్ఎంపి పీఎంపీ గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం అలయ్ బలాయ్!

**క్రైమ్ మిర్రర్,మాల్:** మాల్ గ్రామంలో ఆత్మీయంగా కలుసుకున్న మూడు మండలాల గ్రామీణ వైద్యులు -- దసరా పండుగ సందర్భంగా సోదరభావంతో వేడుకలు మాల్, అక్టోబర్ 11: దసరా పండుగ శుభ సందర్భంగా మాల్ గ్రామంలోని నూతన యాజమాన్యానికి చెందిన పద్మావతి హాస్పిటల్ సహకారంతో ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉక్కుల అశోక్ ఆధ్వర్యంలో ఆర్ఎంపి --పీఎంపీ గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం--అలయ్ బలాయ్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు, వివిధ మండలాల నాయకులు, గ్రామీణ వైద్యులు హాజరై పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. గ్రామీణ వైద్యుల మధ్య ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల అధ్యక్షులు డాక్టర్ మంద మహేందర్, మాడుగుల మండల అధ్యక్షుడు విజయ్, చింతపల్లి మండల అధ్యక్షులు సైదులు, మాడుగుల మాజీ అధ్యక్షులు డాక్టర్ భాస్కర్‌తో పాటు మూడు మండలాల కార్యదర్శులు, ఆర్.ఎం.పి--పీఎంపీ గ్రామీణ వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక దావత్ ఏర్పాటు చేసిన పద్మావతి హాస్పిటల్ యాజమాన్యం ఈ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన గ్రామీణ వైద్యుల కోసం ప్రత్యేకంగా దావత్ ఏర్పాటు చేశారు. ఈ విందును స్పాన్సర్ చేసిన పద్మావతి హాస్పిటల్ నూతన యాజమాన్య ప్రతినిధులు మహేశ్వర్ రెడ్డి, కళ్యాణ్ కుమార్, సందీప్ రెడ్డి కు ఆర్ఎంపి --పీఎంపీ వైద్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మావతి హాస్పిటల్ యాజమాన్యానికి తమ వంతు సహకారం, అండదండలు అందిస్తామని గ్రామీణ వైద్యులు హామీ ఇచ్చారు. వైద్య రంగంలో పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ, ఆత్మీయ సంబంధాలను కొనసాగించుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు విప్ వెంకటేష్, కృష్ణ నాయక్, భిక్షపతి, ప్రొద్దుటూరు రవీందర్, సరికొండ వెంకటేష్, నాగిళ్ల వెంకటేష్, శ్రీనివాస్ చారి,పగడాల వెంకటేష్, ఎస్.ఎస్. చారి, రాజు నాయక్ పాల్గొన్నారు.



# పాలకీడు ప్రజావాణిలో అధికారుల కరువు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం జిల్లా హెడ్ క్వార్టర్ కు వెళ్లేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు కొందరు డుమ్మా కొట్టి కింది స్థాయి అధికారులను పంపి చేతులు దులుపుకున్నారనే విమర్శలు, మండలంలో దాదాపు 23 శాఖల అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉంటుంది. సమావేశానికి హాజరు కాకుంటే సంబంధిత నోడల్ అధికారికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కొందరు అధికారులు సంబంధిత నోడల్ అధికారులకు సమాచారం ఇవ్వనట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ప్రజా సమస్యల కోసం దూర భారం తగ్గించడంతోపాటు, ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఏర్పాటుచేసిన ప్రజావాణి కార్యక్రమానికి కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి సమావేశానికి హాజరు కాలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అధికారులకు ఆదనపు బాధ్యతలు ఉండడంతో రాలేకపోయినట్లు తెలుస్తోంది. మరి కొంతమంది నోడల్ అధికారులకు సమాచారం ఇచ్చారా,మండల స్థాయి అధికారులు గైర్హాజరు అయితే సంబంధిత ఫిర్యాదులు వస్తే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రజలు అంటున్నారు. ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాలి. అయితే పాలకీడులో మధ్యాహ్నం అయినా నోడల్ అధికారి,కొంతమంది అధికారులు సమయానుకూలత కూడా పాటించలేదని ఆరోపణలు ఉన్నాయి. ప్రజావాణిపై నిర్లక్ష్యం వహించిన నోడల్ అధికారి, గైరాజరైన అధికారులు పట్ల విచారణ చేసి ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**సమస్య చెప్పుకోవాలంటే అధికారి ఎక్కడ ?**

మండల ప్రజల నుంచి వినతులు స్వీకరించడం మాత్రమే ప్రజావాణి ఉద్దేశం కాదని, వాటిపై సంబంధిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో స్పందించి పరిష్కారం చూపినప్పుడే కార్యక్రమానికి సార్థకత ఉంటుందని , అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోతే ప్రజలు ఇచ్చే అర్జీల పై తక్షణ స్పందన ఎలా ఉంటుందనే ప్రశ్న తలెత్తుతోంది.ప్రజలు తమ పనులు పక్కనబెట్టి, సమయం వెచ్చించి కార్యాలయానికి వస్తే.. సమస్యలు వినాల్సిన అధికారులే అందుబాటులో లేకపోవడం ఏమిటని పాలకీడు మండల ప్రజలు పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణి వంటి కార్యక్రమాలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. గైర్హాజరైన అధికారుల వివరాలు నమోదు చేసి, సరైన కారణం లేకుండా కార్యక్రమానికి రాని వారిపై చర్యలు తీసుకుంటేనే పరిస్థితిలో మార్పు వస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే నిర్వహించే ప్రజావాణికి అధికారులే రాకపోతే.. ఇక సామాన్యుడి గోడు వినేదెవరు?

**సమయపాలనపై పర్యవేక్షణ ఏదీ?**

ప్రజావాణికి అధికారులు నిర్ణీత సమయానికి హాజరవుతున్నారా? హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారా? ప్రజలు వేచి ఉండకుండా శాఖల వారీగా ఫిర్యాదులు స్వీకరించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉన్నాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ప్రజావాణి రోజున అన్ని శాఖల అధికారులు సమయానికి అందుబాటులో ఉండేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి,ప్రజల ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై కలెక్టర్ చొరవ తీసుకోవాలని, ప్రజావాణిపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### మొక్కుబడిగా ప్రజావాణి... ప్రజల గోడు వినేదెవరు...

గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వివిధ శాఖలకు సంబంధించిన ఇబ్బందులు, ప్రభుత్వ సేవల విషయంలో ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణి వేదికగా ఉండాలి. తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో ప్రజలు కార్యాలయానికి వస్తుంటారు. సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటే సమస్యను అక్కడికక్కడే వారి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే కీలకమైన ప్రజావాణి రోజునే , నోడల్ అధికారి,పలువురు అధికారులు కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. 20 నుంచి 23 మంది వరకు హాజరు కావాల్సిన చోట పది లోపు అధికారులు మాత్రమే రావడంతో మిగతా శాఖలకు సంబంధించిన సమస్యలను ఎవరికి చెప్పుకోవాలంటూ ప్రజలు ప్రశ్నించే పరిస్థితి నెలకొంది.ప్రజల సమస్యల పరిష్కారం కోసమే నిర్వహించే ప్రజావాణికి అధికారులే రాకపోతే.. ఇక సామాన్యుడి గోడు వినేదెవరు? సమస్యకు పరిష్కారం చూపేదెవరు? అనే ప్రశ్నలకు సంబంధిత అధికార యంత్రాంగమే సమాధానం చెప్పాల్సి ఉంది.

# తుక్కాపురం గ్రామ పంచాయతీ సిబ్బందికి దసరా కానుకగా నూతన వస్త్రాల పంపిణీ

**6వ వార్డు సభ్యులు ఏడుమేకల మహేష్ యాదవ్**





**క్రైమ్ మిర్రర్, భువనగిరి జిల్లా బ్యూరో:** దసరా పండుగను పురస్కరించుకుని తుక్కాపురం గ్రామానికి చెందిన 6వ వార్డు సభ్యులు ఏడుమేకల మహేష్ యాదవ్‌బి గ్రామ పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలను దసరా కానుకగా అందజేశారు. గ్రామ అభివృద్ధిలో, పారిశుద్ధ్య నిర్వహణలో, ప్రజలకు నిత్యం సేవలందించడంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా ఏడుమేకల మహేష్ యాదవ్ పేర్కొన్నారు. పండుగ వేళ సిబ్బందితో ఆత్మీయతను పంచుకోవడం, వారి సేవలను గుర్తించి గౌరవించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొని ఏడుమేకల మహేష్ యాదవ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. పండుగల సంతోషాన్ని అందరితో పంచుకుంటూ, గ్రామ సేవకులను గౌరవిస్తూ ముందుకు సాగడం అభినందనీయం. ఈ కార్యక్రమంలో జనగాం మల్లేష్, రాసాల వెంకటేష్ యాదవ్, ఏలకొండ ప్రవీణ్ రెడ్డి,రత్నాపురం లక్ష్మి నర్సింహా,ముంత రాజు, రాసాల మల్లేష్, గజ్జి ప్రశాంత్,రాసాల శివ, గుండెబోయిన సంపత్, వల్లపు నిఖిల్,రాసాల మణికంఠ,పుట్ట మణి, రాసాల మణి తదితరులు పాల్గొన్నారు



## రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కట్టుబడి ఉంటుంది : చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున సంఘీభావం తెలియజేసిన రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా నిర్వహించిన ఈ భారీ నిరసన కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఇతర ముఖ్య నాయకులతో కలిసి రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ప్రజాస్వామ్య సూత్రాలను, రాజ్యాంగ విలువలని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని, ప్రజా గొంతుకను నొక్కే ఏ ప్రయత్నాన్నైనా ఐక్యంగా తిప్పికొడతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగుతున్న ఈ పోరాటంలో అడుగులు ముందుకు వేస్తూ, భవిష్యత్తులోనూ ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తామని పిలుపునిచ్చారు.

# భక్తిశ్రద్ధలతో సేవాలాల్ మహారాజ్, జగదాంబ మాత మాలధారణ

**రేఖ్యాతండాలో ఘనంగా స్వాముల పడిపూజ**

**21 రోజులపాటు దీక్ష చేపట్టిన భక్తులు.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** సేవాలాల్ మహారాజ్, జగదాంబ మాతపై భక్తితో రేఖ్యాతండాలో భక్తులు 21 రోజులపాటు మాలధారణ చేసి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వాముల పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నరసింహ ముదిరాజ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మాజీ మండల అధ్యక్షుడు బిచ్య నాయక్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భక్తి, ఆధ్యాత్మికత, ఐకమత్యం ప్రజల్లో స్ఫూర్తిని నింపుతాయని పేర్కొన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు సమాజంలో ఐక్యతాభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, నాయకులు శ్రీధర్, కృష్ణ, శ్రీను, వినోద్, రాజు, పవన్, చంద్రు, రాంకీ, చిన్ని, భీమ్లా, జానయ్య, రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

